క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ వైర్ల మరమ్మతుల దృష్ట్యా ముత్యాలంపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ శాంతినగర్ ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్ర బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామలింగేశ్వర పేట మెయిన్ రోడ్డు, రామలింగేశ్వర పేట 3 వ లైన్ నుంచి 7 వ లైన్ వరకు, శాంతి నగర్ 0 లైన్ నుంచి 2 వ లైన్ వరకు, డొంక రోడ్డు, లోటస్ ఆకాష్ బ్లాక్ 1నుంచి 5 వరకు, బసవ తారక నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

వీఎంసీలో ఉద్యోగోన్నతులు

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థలో క్లాస్-4గా విధులు నిర్వహిస్తున్న పలువురు ఉద్యోగులకు ఉద్యోగోన్నతి కల్పిస్తు మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అంబేడ్కర్ స్మృతివనం క్యాష్‌కౌంటర్‌లో విధులు నిర్వహిస్తున్న గార్డెనర్ ఎం.విజయలక్ష్మికి ప్రమోషన్ ఇచ్చి, సెక్రటరీ సెల్‌కు జూనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేశారు. మొగల్రాజపురం ఆయుర్వేద డిస్పెన్సరీలో విధులు నిర్వహిస్తున్న ఎఫ్‌ఎన్‌ఓ వర్కర్ డి.బుజ్జికి ఉద్యోగోన్నతి కల్పించి ఎస్టేట్స్ సెక్షన్‌కు జూనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేశారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తున్న జీజేఎంఎస్ ప్రశాంతిని ఆడిట్ సెక్షన్‌కు జూనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేశారు. కండ్రికలోని బి.వి.సుబ్బారెడ్డి వీఎంసీ స్కూల్లో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తున్న కె.రామకృష్ణను సర్కిల్-1 పట్టణ ప్రణాళిక విభాగానికి జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతిపై బదిలీచేశారు. వీఎంసీ ఎస్టాబ్లిష్ సెక్షన్‌లో విధులు నిర్వహించే ప్రజారోగ్య విభాగం పీహెచ్ వర్కర్ ఎ.వెంకటేశ్వరమ్మకు జూనియర్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ కల్పించి అక్కడే విధులు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశారు. ప్రజారోగ్య విభాగంలో శానిటరీ మేస్త్రీగా విధులు నిర్వహించే జి.పద్మశ్రీని అదే సెక్షన్‌కు జూనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

మందుబాబులకు జరిమానా

విజయవాడలీగల్: నిబంధనలు అతిక్రమించి మద్యం తాగడమే కాకుండా, వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన మందుబాబులను కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం జరిమానా విధిస్తూ తీర్పుచెప్పినట్లు నగర పోలీసు కమిషనర్ తెలిపారు. మంగళవారం ఆయన కార్యాలయం నుంచి వెలువడిన ప్రకటనలో వివరాలు తెలియజేశారు. నగరంలో వివిధ ప్రదేశాలలో మద్యం తాగి వాహనాలు నడిపిన 42 మందిని గుర్తించి వారిని ఆరవ అడిషనల్ జ్యుడీషియల్ మెట్రోపాలిటన్ కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి లెనిన్‌బాబు 15 మందికి ఒక్కొక్కరికి రూ.15వేలు, 27మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు. ప్రతిరోజు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి, పట్టుబడిన వారిపై కేసులు నమోదుచేస్తామని, వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు సూచించారు.

ఏడాది పాటు పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి నేతలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలను ఏడాదిపాటు ఘనంగా నిర్వహించనున్నట్టు అమరజీవి పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి నేతలు ప్రకటించారు. సత్యనారాయణపురంలోని సీతారాముల కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు గుడివాడ వేణుగోపాల్ మాట్లాడుతూ 2025 మార్చి 17 నుంచి 2026 మార్చి 16 వరకు పొట్టి శ్రీరాములు 125 జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజధాని అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించడం పట్ల సీఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో సమితి జిల్లా అధ్యక్షుడు కూనల యుగంధర్, గౌరవ అధ్యక్షుడు కృష్ణ, కోశాధికారి బొగ్గరపు వెంకట సత్యనారాయణ, కన్యాకుమారి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): మహిళలు ప్రభుత్వ పథకాల సేవలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సూచించారు. స్థానిక 30వ డివిజన్ రామకృష్ణాపురం ఆర్‌ఎంపీ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం సెంటర్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యాన ఉచిత కుట్టుశిక్షణ కేంద్రం ప్రారంభోత్సవం జరిగింది. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కుట్టు శిక్షణ కేంద్రంను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడ 90 రోజుల పాటు ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వటంతో పాటు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్, ఉచితంగా కుట్టు మిషన్ అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గొట్టుముక్కల రఘురామరాజు, ఘంటా కృష్ణ మోహన్, గరిమెళ్ళ రాధిక పాల్గొన్నారు.

వచ్చే ఏడాదికైనా

తరగతి గదులు పూర్తయ్యేనా?

- ఏకేటీపీ స్కూల్‌లో నిలిచిపోయిన నాడు-నేడు పనులు
- చాలీచాలని తరగతి గదుల్లో విద్యార్థుల అవస్థలు



ఏకేటీపీ స్కూల్‌లో మధ్యలో నిలిచిపోయిన నాడు-నేడు పనులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. పాఠశాలలో చక్కటి ఆహ్లాదకర వాతావరణంలో, విశాలమైన తరగతి గదుల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలతో విద్యార్థులు విద్యను అభ్యసించేలా అనేక విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగానే నాడు-నేడు కార్యక్రమం ద్వారా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దటంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించేందుకు పోటీపడే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోకపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో మాన్పించి తిరిగి ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించేందుకు ఆలోచిస్తున్న పరిస్థితి నెలకొంటోంది.

చాలీచాలని ఇరుకు గదుల్లో విద్యార్థుల అవస్థలు

నగరంలోని సత్యనారాయణపురంలోని ఏకేటీపీ మున్సిపల్ హైస్కూల్ ప్రతి ఏడు పది పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ నగరంలోనే ఉత్తమ పాఠశాలగా పేరొందింది. ఈ స్కూల్‌లో ఆరు నుంచి పదో తరగతి వరకు 50 మంది ఉపాధ్యాయులు, సుమారు 1600 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం ఉన్న పాత భవనంలో విద్యార్థుల సంఖ్యకు తగిన తరగతి గదులు లేకపోవడంతో ఇబ్బందులు పడేవారు. వారి ఇబ్బందుల దృష్ట్యా గత ప్రభుత్వంలో నాడు-నేడు పథకంలో భాగంగా అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు కేటాయించింది. రూ.2.5 కోట్లతో పాఠశాలలో 12 అదనపు తరగతి గదుల నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి పనులకు 2022 జూలై 19న అప్పటి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శంకుస్థాపన చేశారు.



నాడు-నేడు పనుల ప్రారంభోత్సవం నాటి శిలాఫలకం

నిలిచిపోయిన నాడు-నేడు పనులు...

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నాడు-నేడు పనులు మధ్యలో నిలిపివేశారు. తొంబై శాతం పనులు పూర్తిచేసుకున్నప్పటికీ అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో వచ్చే విద్యాసంవత్సరానికైనా విద్యార్థులకు అందుబాటులోకి వస్తుందో లేదో అని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వాపోతున్నారు.

వచ్చే విద్యాసంవత్సరానికైనా పూర్తిచేయాలి...



నాడు-నేడు పనులు మధ్యలో నిలిచిపోవడంతో ఏకేటీపీ స్కూల్‌లో చదివే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలంటే పాఠశాలలో వారికి అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అధికారులు ఈ విషయమై దృష్టి పెట్టి వచ్చే విద్యా సంవత్సరానికి అయినా పనులు పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలి.

– శర్వాణీమూర్తి, 33వ డివిజన్ కార్పొరేటర్

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



చలో ఢిల్లీ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆటో, మోటార్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 24న నిర్వహించ తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి కె.దుర్గారావు కోరారు. బీఆర్టీఎస్ రోడ్డులోని నండూరి ప్రసాద్ భవన్ సి.ఐ.టి.యు కార్యాలయంలో మంగళవారం చలో ఢిల్లీ కార్యక్రమం కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగా ఆటో, మోటార్ కార్మికుల జీవనోపాధి దెబ్బతింటుందన్నారు. కేంద్రంలో బి.జె.పి ప్రభుత్వం భారత న్యాయ సంహిత (106)1,2 చట్టాన్ని అమలు చేయాలని చూస్తోందని, దీని ఫలితంగా మోటార్ కార్మికులపై లక్షల రూపాయల జరిమానాలు, సంవత్సరాల తరబడి శిక్షలు పడే అవకాశం ఉందని అన్నారు. ఈ చట్టాన్ని పోరాటాల ద్వారా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఆటో మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, 21 నంబర్ జీవో రద్దు చేయాలని, ప్రతి ఆటో డ్రైవర్‌కు వాహన మిత్ర పథకం కింద రూ.15 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ బ్యాంకుల ద్వారా సబ్సిడీతో కూడిన ఆటోలు కొనుగోలుకు రుణాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సెంట్రల్ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ సి.ఐ.టి.యు ప్రధాన కార్యదర్శి ఎం. హనుమంతరావు, రైల్వే స్టేషన్ ఆటో వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎస్.కె దుర్గావలి, రైల్వే స్టేషన్ ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎ.వి రెడ్డి, డి.కోటయ్య, ఆఫీస్ బేరర్స్ ఆర్.సుబ్బరాజు, ఎం.ప్రభుదాసు, కోరుకొండ శ్రీనివాసరావు, ఎస్.కె రఫీ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో పాయకాపురం విద్యార్థుల ప్రతిభ



పాయకాపురం(విజయవాడరూరల్): జపాన్ షిటో ర్యు కరాటే స్కూల్ (షూకో-కాయ్ ఈజుషి)ఏపీ ఆధ్వర్యంలో జరిగిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ -2025 పోటీలలో పాయకాపురానికి చెందిన క్యోయూకు కరాటే అకాడమీ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి ట్రోఫీలు కైవసం చేసుకున్నారు. గెలుపొందిన విద్యార్థులకు మంగళవారం పాయకాపురం అకాడమీలో అభినందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నున్న రూరల్ పోలీసు స్టేషన్ సీఐ పి.కృష్ణమోహన్ మాట్లాడుతూ కరాటే పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో గెలుపొందడం అభినందనీయమన్నారు. అనంతరం కరాటే పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను సీఐ సత్కరించారు. క్యోయూకు కరాటే అకాడమీ స్కూల్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ బల్లం కిషోర్ మాట్లాడుతూ అకాడమీ నుంచి 18 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొని మూడు స్థానాల్లో ట్రోఫీలను కైవసం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఎగ్జామినర్ ముత్యాల కరుణాకర్, డాక్టర్ దినేష్ కుమార్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

33వ డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు

కార్పొరేటర్ శర్వాణీమూర్తి

సత్యనారాయణపురం(విజయవాడపశ్చిమ): సత్యనారాయణపురంలోని 33వ డివిజన్‌లో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న పనులను నగరపాలక సంస్థ కౌన్సిల్ ఆమోదంతో పూర్తిచేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణి మూర్తి తెలిపారు. మంగళవారం శివాజీ కేఫ్ సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా తాడంకి వారి వీధిలో శిథిలావస్థకు చేరుకున్న యూజీడీ నిర్మాణంతో తరచుగా మ్యాన్‌హోల్స్ పొంగి రోడ్లపై పారుతూ ప్రజలు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా గత జనవరి నెలలో జరిగిన నగరపాలకసంస్థ కౌన్సిల్ సమావేశంలో సమస్యను కౌన్సిల్ దృష్టికి తీసుకువెళ్లానన్నారు. ముదిగొండ వారి వీధి, వ్యాకరణం వారి వీధుల్లో నూతన సీసీ రోడ్ల నిర్మాణం, ఆంధ్ర రత్న పార్కులో వాచ్‌మన్ షెల్టర్, టాయిలెట్‌ల నిర్మాణం తదితర అంశాలను ప్రతిపాదించి కౌన్సిల్ ఆమోదించడంతో ఆ పనులు టెండర్‌ల దశలో ఉన్నాయని తెలిపారు.

మరిన్ని సమస్యలపై ప్రతిపాదనలు...

ఈ నెల 25న జరిగే నగర పాలక సంస్థ కౌన్సిల్‌లో డివిజన్‌లోని పలు సమస్యలపై ప్రతిపాదనలు పెట్టామన్నారు. అందులో జీఎస్ రాజు రోడ్డులో నిరుపయోగంగా ఉన్న అల్లూరి సీతారామరాజు పార్కును అభివృద్ధి చేసి పిల్లల ఆట పరికరాలు, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని, రాత్రి సమయంలో పలు పనుల కారణంగా నగరానికి వచ్చే మహిళల భద్రత కోసం 'మహిళా షెల్టర్‌'లు ఏర్పాటు చేయాలని, అమృత్ పథకంలో వాటర్ పైప్‌లైన్ నిర్మాణాలు చేసి మధ్యలో పనులు నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే ఆయా పనులు పూర్తి చేయాలని, పలు వీధుల్లో సైడు డ్రైన్‌లను ఆక్రమించి శాశ్వత కట్టడాలు చేపట్టడంతో సిల్ట్ తీసే అవకాశం లేక పారిశుద్ధ్య సమస్య నెలకొంటోందని, శేషగిరిరావు వీధిలో యూజీడీ, సీసీ రోడ్డు నిర్మాణం చేయాలని, ముఖ్యంగా స్థానిక యువకులకు ఉపయోగంగా ఉండేలా జీఎస్ రాజు రోడ్డులోని వాటర్ ట్యాంక్ పక్కన నిరుపయోగంగా ఉన్న నగరపాలకసంస్థకు చెందిన స్థలంలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని, బీఆర్టీఎస్ రోడ్డు సైడు డ్రెయిన్‌లు పూడుకుపోయి మురుగు పారే అవకాశం లేక పారిశుద్ధ్య సమస్య నెలకొంటోందని తదితర విషయాలపై కౌన్సిల్‌లో ప్రతిపాదనలు పెట్టానని చెప్పారు. త్వరలోనే వాటిని ఆమోదింపజేసుకుని పనులు పూర్తిచేయనున్నట్లు ఆయన తెలిపారు.

శాస్త్రోక్తంగా గణపతి హోమం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సంకటహర చతుర్థిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై విఘ్నాధిపతి గణపతికి మంగళవారం విశేష అభిషేకాలు, హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి ఆలయం సమీపంలోని యాగశాల్లో ఆలయ అర్చకులు గణపతి ఉత్సవమూర్తికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చన నిర్వహించారు. అనంతరం యాగశాల్లో నిర్వహించిన గణపతి హోమంలో ఉభయదాతలు పాల్గొన్నారు. సంకట హర చతుర్థిన స్వామిని పూజించడం వల్ల జాతకంలో ఉన్న సమస్యలు తొలగిపోవడంతో పాటు చేపట్టిన పనుల్లో విఘ్నాలు తొలగిపోతాయని అర్చకులు పేర్కొన్నారు. హోమాలను జరిపించుకున్న ఉభయదాతలకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం, ఉండ్రాళ్లను ప్రసాదంగా అందజేశారు.

డప్పు కళాకారుల పెన్షన్ తొలగించేందుకు కుట్ర



అలంకార్ సెంటర్ ధర్నా చౌక్‌లో ధర్నా చేస్తున్న డప్పు కళాకారులు, కేవీపీఎస్ నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వం సర్వే పేరుతో డప్పు కళాకారుల పెన్షన్ తొలగించేందుకు కుట్ర చేస్తోందని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు ఓ.నల్లప్ప, ఆండ్ర మాల్యాద్రి అన్నారు. మంగళవారం విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్ నందు కేవీపీఎస్, డప్పు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో డప్పు కళాకారుల పెన్షన్ల తొలగింపు నిలిపివేయాలని, కొత్త పెన్షన్లు మంజూరు చేయాలనే డిమాండ్లతో ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులు తరతరాలుగా డప్పు కళను నమ్ముకుని జీవనం సాగిస్తున్నారన్నారు. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సర్వే పేరుతో పెన్షన్లు తొలగించే ప్రక్రియ ప్రారంభించిందన్నారు. డప్పు కళాకారుల పెన్షన్ యథావిధిగా కొనసాగించాలని, అర్హులైన వారికి కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. డప్పు కళాకారులకు రూ.7వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెన్షన్ వయస్సు తగ్గించాలని, కళాకారులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ధర్నా చౌక్ నుంచి లెనిన్ సెంటర్‌లోని అంబేడ్కర్ ఐక్యత భవన్‌కు భోజనం చేసేందుకు వెళుతున్న డప్పు కళాకారులు, కేవీపీఎస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సమయంలో వారి మధ్య వాగ్వాదం జరిగింది. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండెమెడ క్రాంతి కుమార్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు జె.వెంకటేష్‌లపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. బలవంతంగా వారిని పోలీసు వాహనాల్లో ఎక్కించి అజిత్‌సింగ్ నగర్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. తమ న్యాయమైన డిమాండ్ల కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న డప్పు కళాకారులు, కేవీపీఎస్ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ఖండించారు.

దోమల నియంత్రణలో భాగస్వాములు కావాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): దోమల నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలని నగర పాలక సంస్థ బయాలజిస్టు సూర్యనాయక్ కోరారు. నగర పాలక సంస్థ కమిషనర్ ఆదేశాల మేరకు 30వ డివిజన్ రామకృష్ణాపురం, దేవీనగర్‌లో మంగళవారం మలేరియా విభాగం ఆధ్వర్యాన దోమల నియంత్రణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. మురుగు కాలువలు, కాలువలలో చెత్తచెదారం వేయరాదని చెత్తను వేయటం వల్ల మురుగు నిలిచిపోయి దోమలు పెరిగే ప్రమాదం ఉందన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ వారంలో ఒక రోజు తప్పనిసరిగా డ్రైడేగా పాటించి నీటి నిల్వలను తొలగించాలని సూచించారు. అనంతరం మలేరియా విభాగం సిబ్బంది యాంటీ లార్వా ఆపరేషన్, కల్వర్టు ఫాగింగ్, పవర్ స్ప్రే చేయించారు. కార్యక్రమంలో మలేరియా ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, సూపర్‌వైజర్ బెనర్జీ, మలేరియా విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

58, 59 డివిజన్‌లలో...

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): అజిత్‌సింగ్ నగర్ ప్రాంతంలో దోమల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టారు. మంగళవారం పలుప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిచారు. దీనిలో భాగంగా 58, 59 డివిజన్‌లలోని పలు వీధుల్లో ఫాగింగ్ చేపట్టారు.

'శక్తి యాప్'తో మహిళల భద్రతకు భరోసా

ఏసీపీ స్రవంతి రాయ్



శక్తియాప్‌పై అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న ఏసీపీ స్రవంతి రాయ్

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రాష్ట్ర పోలీసుశాఖ తీసుకువచ్చిన 'శక్తి యాప్' మహిళల భద్రతకు ఎంతో భరోసా కల్పిస్తుందని నార్త్‌జోన్ ఏసీపీ డాక్టర్ స్రవంతి రాయ్ అన్నారు. సత్యనారాయణపురం శారద కళాశాల జంక్షన్ నుంచి మంగళవారం పాఠశాల విద్యార్థులు, పోలీసు సిబ్బంది 'శక్తి యాప్'పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏసీపీ స్రవంతి రాయ్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల భద్రతే లక్ష్యంగా శక్తియాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. మహిళలు, బాలికలు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఒంటరిగా వెళ్లే మహిళలు అత్యవసర పరిస్థితిలో యాప్‌లోని ఎస్‌ఓఎస్ బటన్ నొక్కితే క్షణాల్లో పోలీసులు మీరు ఉంటున్న ప్రదేశానికి చేరుకుని రక్షణ కల్పిస్తారన్నారు. ఈ యాప్‌పై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి పోలీసు సేవలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఎన్‌పురం సీఐ లక్ష్మీనారాయణ, నున్న సీఐ వెంకటేశ్వర్లు, అజిత్‌సింగ్ నగర్ సీఐ కృష్ణమోహన్, మహిళా ఎస్ఐలు, సిబ్బంది, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లపై ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రహదారులపై అనుమతి లేని నిర్మాణాలు, వ్యాపార సామగ్రి, వాహనాలను స్వచ్ఛందంగా తొలగించి, ట్రాఫిక్ సమస్యలను నివారించడంలో భాగస్వాములు కావాలని త్రీ ట్రాఫిక్ సీఐ కిషోర్‌బాబు సూచించారు. మంగళవారం సాయంత్రం పోలీస్ స్టేషన్ పరిధిలోని సాంబమూర్తి రోడ్డులో రోడ్డును ఆక్రమించి అక్రమ నిర్మాణాలు, వ్యాపార సామగ్రి, వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కిషోర్‌బాబు మాట్లాడుతూ రోడ్లను ఆక్రమించుకుని వ్యాపారాలు చేయడం వలన తరచు ట్రాఫిక్ సమస్య నెలకొంటోందన్నారు. దీనిపై మూడు నెలల క్రితం రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేసుకునే వారితో మాట్లాడి స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించాల్సిందిగా సూచించినట్లు తెలిపారు. అయినా కొంత మంది వ్యాపారులు స్పందించకపోవడంతో వాటిని తొలగించినట్లు తెలిపారు. వ్యాపారులు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా తమ వ్యాపారాలను చేసుకోవాలని లేనిపక్షంలో కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా రామాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు



శ్రీకోదండ రామాలయం వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా పూజలు చేస్తున్న భక్తులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీ కోదండ రామాలయంలో మంగళవారం వార్షిక బ్రహ్మోత్సవాలు ఆలయకమిటీ ఆధ్వర్యాన ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ శ్రీ కోదండ రామచంద్రస్వామికి అభిషేకం మహోత్సవం, శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణం, శేష వాహన సేవలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు దాట్ల వెంకట నరసింహరాజు మాట్లాడుతూ ఈనెల 20 తేదీ గురువారం బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీత్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో శ్రీ కోదండ రామచంద్రస్వామి, శ్రీ వెంకటేశ్వరస్వామి, శ్రీవేణుగోపాల స్వామివారి కల్యాణం జరుగుతుందన్నారు. భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు. ఈ నెల 23వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయని తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు బ్రహ్మోత్సవాలలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేత్రపర్వంగా సాగిన శ్రీకృష్ణలీలలు పద్యనాటక ప్రదర్శన



శ్రీకృష్ణలీలలు నాటకాన్ని ప్రదర్శిస్తున్న సురభి కళాకారులు

విజయవాడకల్చరల్: ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ, సృజనాత్మక సమితి, దక్షిణ మండల సాంస్కృతిక కేంద్రం తంజావూరు ఆధ్వర్యంలో సురభి నాటకోత్సవాలలో భాగంగా మంగళవారం దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో ప్రదర్శించిన శ్రీకృష్ణలీలలు పద్య నాటకం హృద్యంగా సాగింది. పోతన భాగవతం ఆధారంగా రచించిన ఈ నాటకంలో శ్రీకృష్ణుని జననం, పూతన, శకటాసుర సంహారం, కాళీయ మర్ధనం, గోవర్ధనగిరిని ఎత్తడం, గోవులను రక్షించడం, కంస సంహారం తదితర అంశాలతో నాటకం సాగింది. నిర్వహణ సురభి డ్రామా థియేటర్, బాలాజీ సురభి థియేటర్స్, పర్యవేక్షకులు సురభి ఎం.నాగరాజు, సురభి జయానంద్.

సురభి కళాకారులు ధన్యజీవులు:

సురభి కళాకారులు ధన్యజీవులని విశ్రాంత పోలీస్ అధికారి ఎం.సత్యనారాయణ అన్నారు. మంగళవారం నాటి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పద్య నాటకానికి జీవితాలను అంకితం చేసిన సురభి కళాకారులను గుర్తించి, వారికి ప్రోత్సాహం అందించాలని సూచించారు. నర్తనం పత్రిక చీఫ్ ఎడిటర్ మాధవి పురాణం, దూరదర్శన్ వ్యాఖ్యాత అన్నపూర్ణ పాల్గొన్నారు.

పోషక విలువలపై విద్యార్థులకు అవగాహన



పోషక విలువలను తెలియజేసే ప్లకార్డులతో విద్యార్థులు

పాయకాపురం(విజయవాడరూరల్): విద్యార్థి దశ నుంచే పోషక విలువలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం ఢిల్లీకి చెందిన ఆశీర్వాద సంస్థ విద్యార్థులకు పోషకాహార విలువలపై అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థులు నిత్యజీవితంలో తీసుకుంటున్న ఆహార పదార్థాలలో అయోడిన్ పోషక విలువలు ఏ మేరకు ఉంటాయనే విషయాలను తెలియజేశారు. తీసుకునే ఆహారపదార్థాలలో పోషకాలు తక్కువగా ఉంటే సంభవించే ఆరోగ్య సమస్యలను విద్యార్థులకు వివరించారు. శరీర దారుఢ్యానికి, మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన పోషకాహారం గురించి తెలియచేశారు. 8, 9 తరగతుల విద్యార్థుల ఎత్తును, బరువును పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మ, సైన్స్ ఉపాధ్యాయులు రాధిక, ఉదయలక్ష్మి, సంస్థ ప్రతినిధులు శ్రావణ్‌కుమార్, సీతామహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.